క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా అధ్యక్షుల నియామకం

ఏలేశ్వరం: ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఏలేశ్వరం, శంఖవరం మండలాలకు వైఎస్సార్ సీపీ మండల సోషల్ మీడియా అధ్యక్షులను నియమించింది. ఈ మేరకు శుక్రవారం పార్టీ కేంద్రం కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏలేశ్వరం మండల అధ్యక్షుడిగా కొవ్వూల రాజశేఖర్, శంఖవరం మండల అధ్యక్షుడిగా బర్ల శ్రీనులను నియమించారు.

ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య ఫార్మసీ కళాశాలలో ఐదు రోజుల పాటు నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శుక్రవారంతో ముగిసినట్టు ప్రిన్సిపాల్ రవి శంకర్ తెలిపారు. రీసెంట్ అడ్వాన్స్ అండ్ ఫ్యూచర్ పర్‌ఫెక్ట్ ఇన్ ఫార్మకోగ్నోసి అనే అంశంపై ఫాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ప్రముఖ యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్స్‌కు చెందిన సైంటిస్టులు, ప్రొఫెసర్లు వక్తలుగా వ్యవహరించి తమ అనుభవాలను పంచుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జెఎన్‌టీయూ ఫార్మసీ హెడ్ బి.భవాని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ వేడుకలు



యూనియన్ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న ఆర్టీసీ ఉద్యోగులు

ఏలేశ్వరం: ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ వేడుకలు శుక్రవారం పట్టణంలో ఘనంగా జరిగాయి. స్థానిక ఆర్టీసీ డిపో సమీపంలోని యూనియన్ కార్యాలయం వద్ద యూనియన్ డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ బీవీ రావు, డిపో అధ్యక్షుడు బినానిబాబు, రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఆర్ కృష్ణ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి యుబిఎం కుమార్ మాట్లాడుతూ 1952లో ఇదే రోజున యూనియన్ ఆవిర్భవించిందన్నారు. అప్పటినుంచి చేసిన అనేక పోరాటాల ఫలితంగా కార్మికులకు సంక్షేమ పథకాలు అందాయన్నారు. యాజమాన్యం ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేయాలని, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్ రావు, బీవీ రావు, ఎన్‌వీరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బారు



జగ్గంపేట ప్రజాదర్బార్‌లో వినతి పత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకుని తక్షణమే పరిష్కరించేందుకే ప్రజాదర్బారు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. జగ్గంపేట క్యాంప్ కార్యాలయంలో శుక్రువారం ప్రజా దర్బారు నిర్వహించారు. ప్రజా సమస్యలపై వినతి పత్రాలను ఎమ్మెల్యే స్వీకరించారు. వాటిని తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

పంటల బీమా నమోదు చేసుకోవాలి

గోకవరం: ఖరీఫ్‌లో వరి సాగు చేస్తున్న రైతులు పంటల బీమా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి రాజేశ్వరి గురువారం ఓ ప్రకటనలో సూచించారు. వరి పంటకు ఇన్సూరెన్స్ ప్రీమియం ఎకరాకు రూ.570 చెల్లించాలన్నారు. బ్యాంక్, సొసైటీలో పంట రుణం తీసుకునే వారు ఆగస్టు 15 నాటికి ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలన్నారు. పంట రుణం తీసుకోని రైతులు మీ సేవా కేంద్రం లేదా పోస్ట్ ఆఫీస్ ద్వారా క్రాప్ ఇన్సూరెన్స్ చెల్లించాలన్నారు. పంటకు నష్టం వాటిల్లితే ఎకరాకు రూ.38,000 బీమా వర్తిస్తుందన్నారు. పంట రుణం తీసుకోకుండా ప్రీమియం చెల్లించే రైతులు రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ, ఉద్యానవన సహాయకుల నుంచి ఏరియా సోన్ సర్టిఫికెట్ తీసుకుని ప్రీమియం చెల్లించుకోవాలని సూచించారు.

మమ్మేలు మరిడమ్మ

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పెద్దాపురం మరిడమ్మ వారు పేరొందారు. అమ్మవారికి ప్రీతికరమైన రోజు శుక్రవారం కావడంతో బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పునరావాసం ప్రశ్నార్థకం !

- తీరప్రాంతంలో శిథిలావస్థకు చేరిన పునరావాస భవనాలు
- వరదలు, తుపానుల సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



పైడికొండలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన పునరావాస భవనం

తొండంగి: తుపానులు, వరదల వంటి ప్రకృతి వైపరీత్యాల నుంచి తీరప్రాంత ప్రజలకు తాత్కాలికంగా పునరావాసం కల్పించేందుకు ప్రభుత్వం దీర్ఘకాలం క్రితం తుపాను పునరావాస భవనాలు నిర్మించింది. ప్రస్తుతం మూడు ప్రాంతాల్లో కొత్తవి నిర్మించగా పాత భవనాలన్నీ దాదాపు శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రభుత్వాలు మారుతున్నా తీరప్రాంత గ్రామాల ప్రజలకు రక్షణ మాత్రం ఉండటం లేదు. తీర ప్రాంతం పరిరక్షణపై ముందు చూపు, కార్యాచరణ కొరవడటంతో తీరప్రాంత ప్రజలకు పునావాసం ప్రశ్నార్థకంగా మారింది.

11 పంచాయతీల్లో 27 భవనాలు

కోన ప్రాంతంలో సముద్రతీరం అధికంగా ఉండటంతో ప్రభుత్వం తొండంగి, పైడికొండ, కోదాడ, కృష్ణాపురం, శృంగవృక్షం, ఏవీ నగరం, కె.పెరుమాళ్లపురం, వేమవరం, యర్రయ్యపేట, జి.ముసలయ్యపేట, దానవాయిపేట గ్రామాల్లోని 11 పంచాయతీల్లో 27 తుపాను పునరావాస భవనాలను దీర్ఘకాలం క్రితం నిర్మించారు. ఈ భవనాలను గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు మొదటి అంతస్తుతో నిర్మించారు. భవనం పక్కనే ప్రజలకు అవసరమైన మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. గతంలో తుపానులు వచ్చిన ప్రతి సందర్భంలోనూ రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో తీర గ్రామాల ప్రజలకు ఈ భవనాల్లో తాత్కాలికంగా పునరావాసం కల్పించే వారు. అక్కడే విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, భోజన ఏర్పాట్లు వంటి సౌకర్యాలు కల్పిస్తారు.

పుచ్చుపోయిన కిటికీలు, గుమ్మాలు

వాతావరణశాఖ తుపానులపై అప్రమత్తంగా ఉండాలని ప్రకటించగానే అధికార యంత్రాంగం అప్పటికప్పుడు తుపాను పునరావాసభవనాల వద్ద హడావిడి చేసి, అనంతరం వాటి నిర్వహణను పట్టించుకోని పరిస్థితి నెలకొంది. దీంతో భవనాల కిటికీలు, గుమ్మాలు పూర్తిగా పుచ్చిపోవడంతో పాటు కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంతో భవనం శ్లాబ్, మెట్లు కూడా పెచ్చులూడి పడిపోతున్నాయి.

ఆందోళన చెందుతున్న ప్రజలు

శిథిలావస్థకు చేరిన తుపాను భవనాలు ఎప్పుడు కూలిపోతాయోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైడికొండ పంచాయతీ కార్యాలయం, పాఠశాలకు సమీపంలోని శిథిలమైన భవనంతో పాటు వేమవరం, కోదాడ తదితర గ్రామాల్లో ప్రమాదకర స్థితిలో ఉండటంతో అధికారులు తొలగించారు. అలాగే కొత్తపోడిపల్లిపేట, వాకదారిపేట, గడ్డిపేట, పెరుమాళ్లపురం, తొండంగి తదితర ప్రాంతాల్లో భవనాలు కూడా కూలిపోయేందుకు సిద్ధం ఉన్నాయి.

రూ.90 లక్షలతో..

తీరప్రాంతంలో పాత పునరావాస భవనాలు శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో జాతీయ తుపాను విపత్తుల నివారణ సంస్థ రూ.90 లక్షలతో పైడికొండ, ఆవులమంద, లక్ష్మణుడుపేటలో నూతన పునరావాసభవనాలు నిర్మించారు. లక్ష్మణుడుపేట భవనంలో గత కొన్నేళ్లుగా ప్రభుత్వ డిగ్రీక ళాశాలను నిర్వహిస్తున్నారు. కాగా మిగిలిన రెండు కేంద్రాల్లో సోలార్ విద్యుత్, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు ఉన్నప్పటికీ వాటి నిర్వహణ అధికారులు పట్టించుకోకపోవడంతో మరమ్మతులకు గురయ్యాయి.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

మండలంలోని తుపాను పునరావాస భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. మందుబాబులు, పేకాట రాయుళ్లకు ఈ భవనాలు అడ్డాగా మారాయి. బుచ్చియ్యపేట, పైడికొండ, గడ్డిపేట, హుకుంపేట తదితర గ్రామాల్లో భవనాల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. తొండంగి తుపాను భవనంలో తహసీల్దార్ కార్యాలయం దీర్ఘకాలం పాటు నిర్వహించగా ఇటీవల మండల పరిషత్ కార్యాలయంలో కొత్త భవనానికి మార్చారు. లక్ష్మణుడుపేటలో కొత్త భవనంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్వహిస్తున్నారు. పెరుమాళ్లపురం పాత భవనంలో పంచాయతీ, గోర్సపాలెంలో భవనాన్ని బీసీ బాలికల వసతి గృహంగా వినియోగిస్తున్నారు.. శిథిల భవనాలు ఎప్పుడు కూలిపోతాయోనని బాధిత గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నూతన భవనాల నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



వాకదారిపేటలో శిథిలావస్థకు చేరిన తపాను పునరావాస భవనం



పెరుమాళ్లపురం మెయిన్ సెంటర్లో పునరావాస భవనం

నివేదిక ఇవ్వమని ఆదేశించాం



మండలంలోని తుపాను పునరావాస భవనాల పరిస్థితిపై క్షేత్రస్థాయిలో సమగ్రమైన నివేదిక రూపొందించి ఇవ్వమని అధికారులను ఆదేశించాం. నేను ప్రస్తుతం ఇన్‌చార్జిగా ఉన్నాను. త్వరలో దీనిపై వీఆర్వోలు, పంచాయతీరాజ్ అధికారులతో సమీక్షిస్తాను. జిల్లా కలెక్టర్‌కు దీనిపై నివేదిక సమర్పించి వారి నుంచి వచ్చిన ఆదేశాల మేరకు పునరావాస భవనాలపై అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– ప్రసాద్ ఇన్‌చార్జి తహసీల్దార్, తొండంగి మండలం

నూతన భవనాలు నిర్మించాలి



తీరగ్రామాల్లోని తుపాను పునరావాస భవనాలు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. కొత్తగా నిర్మించిన చోడిపల్లిపేట భవనంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్వహిస్తున్నారు. ఏదైనా విపత్తులు వస్తే కోన ప్రాంత ప్రజలకు పునరావాసం కల్పించడం కష్టమే. ఉన్నతాధికారులు నూతన భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలి.

– కాలిన గంగాధర్, పెరుమాళ్లపురం

14న వైఎస్సార్ సీపీ మండల స్థాయి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లగుడు శ్రీనివాసు

కోటనందూరు: స్థానిక సాయినగర్‌లో ఈ నెల 14న నిర్వహించే వైఎస్సార్ సీపీ మండల స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎంపీపీ లగుడు శ్రీనివాసు కోరారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు ఇంటి ఆవరణలో శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యంగా సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. విభేదాలకు తావులేకుండా గ్రామస్థాయి నాయకులంతా ఏకతాటిపై ఉండి సమావేశానికి పార్టీ కార్యకర్తలను తీసుకొచ్చే బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి లాలం బాబ్జీ, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గొర్లి రామచంద్రరావు, వాణిజ్య విభాగం తుని నియోజకవర్గ కన్వీనర్ వెలగా వెంకటకృష్ణాజీ, మండల కన్వీనర్ చింతకాయల చిన బాబు, బొంగు ఉమారావు, నల్లమిల్లి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జ్ నిర్మాణంపై డెమో

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు అధ్యయన-పరిశ్రమ పరస్పర సంబంధ కార్యక్రమంలో భాగంగా రాజమహేంద్రవరంలో గోదావరి నదిపై బ్రిడ్జ్ నిర్మాణంపై టెస్ట్ ప్రాక్టికల్ డెమో నిర్వహించినట్టు డాక్టర్ టి.జ్ఞానానందరావు తెలిపారు. ప్రాజెక్ట్ సైట్‌లో 200 టన్నుల డైనమిక్ లోడ్ టెస్ట్‌ను ప్రత్యక్షంగా వీక్షించినట్టు పేర్కొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు



కిర్లంపూడి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం ప్రత్తిపాడు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు శుక్రవారం తెలిపారు. కిర్లంపూడిలోని మాజీ మంత్రి, పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు (పీఏసీ) ముద్రగడ పద్మనాభం నివాసంలో మధ్యాహ్నం మూడు గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. శాసన మండలి ప్రతిపక్ష నేత, వైఎస్సార్ సీపీ ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి, పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షులు దాడిశెట్టి రాజా, పార్టీ జగ్గంపేట నియోజకవర్గ కో ఆర్డినేటర్ తోట నరసింహం ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ అనుబంధ విభాగాల కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేయాలని గిరిబాబు కోరారు.

వరివడిగా ఖరీఫ్ సాగు



బెండపూడిలో వరినాట్లు వేస్తున్న దృశ్యం

తొండంగి: మెట్టలో ఖరీఫ్ వరినాట్లు ప్రారంభమయ్యాయి. మే, జూన్ నెలల్లో వర్షాలు విస్తారంగా కురవడంతో ఖరీఫ్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే వ్యవసాయబోర్ల పరిధిలో వరినారు పోయడంతో నాట్లు పక్రియ ప్రారంభమైంది. మండల వ్యాప్తంగా సుమారు 600 వ్యవసాయ బోర్లు ఉండగా సుమారు రెండు వేల ఎకరాల్లో బోర్లు ద్వారా వచ్చే సాగునీటిపైనే సాగు జరుగుతోంది. బెండపూడి, రావికంపాడు, పి.ఇ.చిన్నాయపాలెం, ఎ.కొత్తపల్లి, సీతారాంపురం, కొమ్మనాపల్లి, కోదాడ, శృంగవృక్షం, తొండంగి, పి.అగ్రహారం, పైడికొండ, కృష్ణాపురం ప్రాంతాల్లో వ్యవసాయ బోర్లు పరిధిలో ఖరీఫ్ సాగుపనులు ముమ్మరంగా సాగనున్నాయి. కాగా పంపా, పీబీసీ ఆయకట్టు పరిధిలో కూడా రైతులు నారుమడుల కోసం విత్తనాలు వేస్తున్నారు. ప్రస్తుతం రైతులు సాగు పనుల్లో బిజీగా ఉన్నారు.

‘తోట’ ను కలసిన పీహెచ్‌సీ సిబ్బంది



వీరవరంలో తోట నరసింహం, రాంజీలను కలసిన వైద్యురాలు స్వాతి, సిబ్బంది

కిర్లంపూడి: మండలంలోని వీరవరం పీహెచ్‌సీ వైద్యురాలుగా బి.స్వాతి బాధ్యతలు చేపట్టారు. కాగా శుక్రవారం వీరవరంలోని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గం కో ఆర్డినేటర్ తోట నరసింహం, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట రాంజీలను ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. పలువురు పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఆదిత్య ఆస్పత్రి వైద్యులు

గోకవరం: మండలంలోని కామరాజుపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గోకవరానికి చెందిన ఆదిత్య మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. విద్యార్థుల ఆరోగ్యంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పాలూరి బోసుబాబు, స్కూల్ చైర్మన్ బి.రాధాకృష్ణ, సొసైటీ చైర్మన్ పిల్లా వేంకటేశ్వరరావు, డాక్టర్ భారతి, తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గమ్మకు చండీ హోమం



వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు సూర్యనారాయణ ఘనపాఠి, కోట వంశీ, చిట్టిం వాసు, చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. హోమంలో 30 మంది భక్తులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు కుంకుమ పూజలు

సత్యదేవుని ప్రధానాలయంలో దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలోనూ, కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు చిట్టిం హరగోపాల్ ఆధ్వర్యంలోనూ పండితులు కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

దాత సాయంతో గోతుల పూడ్చివేత



కాత్రావులపల్లిలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ



గుంతలు పూడ్చిన తరువాత రోడ్డు

సాక్షి ఇంపాక్ట్

జగ్గంపేట: మండలంలోని కాత్రావులపల్లిలో మెయిన్ రోడ్డు కిలో మీటర్ మేర గోతులతో అధ్వానంగా మారింది. వర్షం పడితే గోతుల్లో నీరు చేరి రోడ్డు చెరువును తలపిస్తోంది. దీనిపై ‘నడుము విరిగేలా గుంతలు’ అనే శీర్షికతో ‘సాక్షి’లో ఇటీవల కథనానికి గ్రామానికి చెందిన ముసినీడి ఆంజనేయులు చారిటిబుల్ ట్రస్టు అధినేత ముసినీడి నాగేశ్వరరావు స్పందించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాలని భావించారు. రూ.లక్షకు పైగా ఖర్చు చేసి సిమ్మెంట్, కంకర కలిపిన మిక్సర్‌తో గోతులను పూడ్చి వేయించారు. కాత్రావులపల్లిలో గోతుల పూడ్చే పనులను ఎంపీడీఓ చంద్రశేఖర్‌రావు పరిశీలించారు. ఈ రోడ్డు మీదుగా ప్రతిరోజూ స్కూల్ బస్సులు, పలు గ్రామాల ప్రజలు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తారు. గోతులు పూడ్చడంతో తమకు ఇబ్బందులు తప్పాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దాత ముసినీడి నాగేశ్వరరావుకు ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం



రాచపల్లిలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

తుని: స్థానిక డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. జనాభా పెరుగుదల వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ×యువతపై పెట్టుబడి పెట్టండి-భవిష్యత్‌ను సురక్షితం చేసుకొండి₹ అనే అంశంపై వ్యాస రచన పోటీలు, జనాభా పెరుగుదల-పర్యావసానాలు అనే అంశంపై క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి.లక్ష్మి, అర్థశాస్త్ర అధ్యాపకులు వి.పద్మావతి, ఆర్ట్స్ విభాగాధిపతి వి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాచపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి గీత మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ, లింగ సమానత్వం, పేదరికం, మాత ఆరోగ్యం, మానవ హక్కులు, జనాభా సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఎస్ ఎస్.కుమారి, ల్యాబ్ టెక్నీషియన్ అజయ్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



తుని డిగ్రీ కళాశాలలో విద్యార్థినికి బహుమతి అందిస్తున్న దృశ్యం



కిర్లంపూడిలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

కిర్లంపూడి: మండలంలోని కిర్లంపూడి, గెద్దనాపల్లి, వీరవరం పీహెచ్‌సీల్లో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ రాంబాబునాయక్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి కిర్లంపూడిలో ర్యాలీ నిర్వహించి ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన సమయంలో గర్భం దాల్చడం ద్వారానే తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారన్నారు. డాక్టర్ల సూచనల మేరకు సంతానం మధ్య అంతరం ఉండాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జ్యోతి, పీహెచ్‌ఎన్ అన్నపూర్ణ, హెల్త్ సూపర్‌వైజర్లు రమణమూర్తి, అనంతలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

బీఎల్ఓలకు శిక్షణ



గండేపల్లిలో బీఎల్‌ఓలకు శిక్షణ ఇస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

గండేపల్లి: ఓటర్ల నమోదు ప్రక్రియలో ప్రజలతో సఖ్యతగా మెలిగి పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఆర్.శ్రీనివాస్ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం బీఎల్ఓలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గ్రామాల్లో ఓటర్ల వివరాల సేకరణ, నమోదు, ఫారం 6, 7, 8 పూర్తి చేయడం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది, బీఎల్ఓలు పాల్గొన్నారు.

టిప్పర్లను నిలిపి వేయకపోతే నిరాహార దీక్ష



విలేకర్లతో మాట్లాడుతున్న కృష్ణ

శంఖవరం: రౌతులపూడి నుంచి శంఖవరం మీదుగా కత్తిపూడి వేళ్లే భారీ టిప్పర్లను నిలిపి వేయకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని సామాజిక కార్యకర్త మేకల కృష్ణ హెచ్చరించారు. శుక్రవారం ఆయన స్వగ్రామం శంఖవరంలో విలేకరులతో మాట్లాడారు. నిత్యం అనేక లారీలు భారీ నల్లబండరాళ్లు, ఎర్రమట్టి (లేటరైట్), గ్రావెల్‌తో రాకపోకలు చేయడం వలన దుమ్ము, దూళి లేచి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రయాణికులు, వృద్ధులు, పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, అటవీ, రవాణా, పోలీస్ శాఖ అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించకపోతే ఈ నెల 21 నుంచి 24 వరకూ రిలే దీక్ష, అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే 25న ఆమరణ దీక్ష చేపడతానని హెచ్చరించారు. దీక్షలు ప్రజలందరూ మద్దతు పలకాలని కోరారు.